క్లుప్తంగా

ప్రేమ స్వరూపుడు ఏసుక్రీస్తు



ఫిరంగిపురం: ఏసుక్రీస్తు ప్రేమ స్వరూపుడని ఫాదర్ విలియమ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ విలియమ్ వాక్యోపదేశం చేస్తూ ప్రతి మానవుడి జీవితంలో కష్టం, సుఖం ఉంటాయన్నారు. ప్రతి మానవుడు పాపాలు చేస్తాడని ఎవరైతే తాను చేసిన పాపాలు తెలుసుకుని పశ్చాత్తాపం చెంది మారు మనసు పొందుతాడో అతడిని క్రీస్తు అనుగ్రహిస్తాడని చెప్పారు. క్రీస్తు చూపిన దైవ మానవ ప్రేమ మొదటి ప్రేమ అని, ప్రభువు నడిచిన బాటలో నడవాలన్నారు. అనంతరం దివ్య పూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పి.బాలస్వామి, సహాయ విచారణ గురువులు అనిల్‌కుమార్, డికన్ బాల ఉన్నారు.

వైఎస్సార్ సీపీతో మైనార్టీలకు భవిత



షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : ముస్లిం మైనార్టీల భవితవ్యం వైఎస్సార్ సీపీతోనే ముడిపడి ఉందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత తత్వ బీజేపీ వైఖరితో వెనుకబడిన ముస్లింల అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అయిన ఎన్ఆర్సీ, సీఏఏ చట్టాలపై మైనార్టీలు అభద్రతా భావానికి గురవుతున్న వేళ ముస్లిం మైనార్టీలలో దాగిఉన్న భయాన్ని తొలగించే విధంగా రాష్ట్రంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను కొనసాగిస్తామని, మైనార్టీలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ ప్రకటన చేసి భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు. ముస్లిం, మైనార్టీలంతా మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థినిగా మురుగుడు లావణ్యలను గెలిపించాలని కోరుతున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నీరుకొండలో సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఎన్నికల శిక్షణ తరగతుల పరిశీలన



తాడికొండ: తాడికొండ నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం నుంచి ప్రారంభమైన పీవో, ఏపీవోల ఎన్నికల శిక్షణ తరగతులను ఎన్నికల ప్రత్యేకాధికారి కార్తికా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికలు సక్రమ నిర్వహణకు శిక్షణా తరగతులు ప్రధానమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ఏమైనా అనుమానాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పలు అంశాలపై సిబ్బందితో మాట్లాడిన ఆమె ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, సర్వేయర్ బాబురావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నవ్వుతోనే ఆరోగ్యం



గుంటూరు వెస్ట్: ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనే గొప్ప ఆయుధం నవ్వని లాఫింగ్ క్లబ్ గుంటూరు వ్యవస్థాపకులు లాల్ వజీర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ వజీర్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలుగా మేలన్నారు. సమస్యలు రాని మనుషులు ఉండరని, వాటిని చిరునవ్వుతో ఎదిరిస్తే ప్రపంచాన్ని జయించేంత ఆత్మ బలం చేకూరుతుందన్నారు. చక్కని వ్యాయామం, యోగ, మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ జీవించాలని దీనికి అదనంగా నవ్వును కూడా జోడించాలన్నారు. లాఫింగ్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా నవ్వుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

తాడేపల్లి పట్టణ పరిధిలో మార్మోగిన జగన్నినాదం

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నలు దిక్కులా హోరెత్తిన ఎన్నికల ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, పలువురు నాయకులు
- ఘన స్వాగతం పలికిన మహిళలు
- ఒకేరోజు 15 వార్డులలో రోడ్‌షో
- అభివృద్ధి, సంక్షేమం కోసం మరో మారు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించిన నాయకులు



చర్చిలో పాస్టర్ నుంచి ఆశీర్వాదం పొందుతున్న మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నికల ప్రచారం జగన్నినాదంతో ముందుకు సాగింది. మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్యతో కలిసి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సింకా గంగాధర్, మాచర్ల అబ్బు, స్నేహసంధ్య, ఎండీ గోరె, దర్శి విజయశ్రీ,, లక్ష్మీరోజ, గోలి రూపవల్లి, గాలయ్య, శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలంటూ నాయకులు విస్తృత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు డోలాస్‌నగర్, గాంధీనగర్, ప్రభు ప్రకాష్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, శివదుర్గాపురం, పాపాయమ్మ కొట్టు, ఇండస్ట్రీ కాలనీ, నులకపేట, బొగ్గిళ్లు, బ్రహ్మానందపురంలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. లావణ్య రాకను పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. డోలాస్‌నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు చర్చిలలో మహిళలతో కలసి ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాస్టర్లు మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నులకపేటలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం బొగ్గిళ్లలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి మురుగుడు లావణ్య ప్రచారం నిర్వహించారు. బ్రహ్మానందపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు దర్శి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఘన స్వాగతం పలికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రోడ్‌షో నిర్వహించారు. చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మంగళగిరి–తాడేపల్లి పాత జాతీయ రహదారిపై సాయిబాబా గుడివద్ద నుంచి ప్రచారం ప్రారంభించగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎంఎస్ కాలనీ, ముగ్గురోడ్డు, సలాంసెంటర్, కృష్ణుడి గుడి, నెహ్రూబొమ్మ సెంటర్, బోసుబొమ్మ సెంటర్, మార్కెట్ సెంటర్, ఉండవల్లి సెంటర్, కెఎల్ రావు కాలనీ, సీతానగరం రామకృష్ణ మిషన్ స్కూల్, ఎండలో ఆంజనేయస్వామి గుడి, బోటు యార్డు, సెటిల్‌మెంట్ స్కూల్, సుందరయ్య కట్ట, సీఎస్ఆర్ రోడ్, విజయవాడ క్లబ్ రోడ్ వరకు ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్ళం రాజారెడ్డి, బండి సుధాకర్, ఎస్సీ, బీసీ, మహిళా విభాగం అధ్యక్షులు బాలసాని అనిల్, మేడా వెంకటేశ్వరరావు (పండు), బత్తుల దాసు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, వీరభద్రస్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ చిన్నబోతుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ మీ అందరికీ అందుబాటులో ఉండి మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. టీడీపీ వాళ్లలాగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కకుండా ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఆమె కోరారు. ఎన్నికలు జరగక ముందే వారి ఇళ్లకు పిలిపించుకుని ప్రచారాన్ని కూడా ఏసీ గదుల్లో నిర్వహించేవారికి ఓటు వేస్తారో, మీ మధ్య ఉంటూ ఎప్పుడైనా కలిసే అవకాశం ఉన్న ఒక బీసీ మహిళ అయిన తనకు ఓటు వేసి గెలిపిస్తారో ఆలోచించుకోవాలని కోరారు. ఏదైనా పని కావాలంటే నాయకుల చుట్టూ తిరిగే ప్రభుత్వం కావాలో.. మీ ఇంటికి వచ్చి పని చేసిపెట్టే వారు కావాలో ఆలోచించి విలువైన ఓటును వినియోగించాలని కోరారు. గత ఐదేళ్ల కాలంలో అందిన సంక్షేమం తిరిగి పొందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

జనరంజక పాలన జగనన్నతోనే సాధ్యం



ఎన్నికల ప్రచారంలో కరపత్రం అందజేస్తున్న రిషిక

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమార్తె రిషిక అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెం, కుమ్మరిపాలెం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఇంటి వద్దకే పింఛను రావాలన్నా, పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఆయనను గెలిపించుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన తల్లి సుచరితను, ఎంపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం సునీత, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, బి.అంజిరెడ్డి, అబ్దుల్ గఫార్, పి.చిన్న, వి.బ్రహ్మయ్య, హేమలతారెడ్డి, లింగారావు, టి.సుబ్బారావు, కె.మల్లికార్జునరావు, ఎస్ నాగరాజు, ఆర్ రంజన్ బాబు, ఆర్ రత్నబాబు, టి.వెంకటస్వామి, టి.ప్రసాద్, కె.ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన పలువురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంజీవయ్యనగర్ ఫస్ట్ లైన్‌లో నివాసించే ద్వారక మధ్యవర్తుల ద్వారా ప్రైవేట్ బ్యాంకులో లోన్ తీసుకుంది. ఐదు నెలలుగా బ్యాంకు వాయిదాలు చెల్లించడం లేదు. మధ్యవర్తిగా వ్యవహరించిన లక్ష్మి, గాయత్రి, కల్యాణి, బాలు ఆదివారం ద్వారకా వద్దకు వెళ్లి లోన్ ఎందుకు చెల్లించడం లేదని అడిగారు. వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. లక్ష్మి, గాయత్రీ, కల్యాణి, బాలు కులం పేరుతో దూషించి చెయ్యి చేసుకున్నారు. ద్వారాక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తొలిరోజు పోలైన 258 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో తొలిరోజు 473 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గానూ 258 ఓట్లు పోలైనట్లు ఎన్నికల నిర్వహణాధికారి ఎం గంగరాజు తెలిపారు. లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల శిక్షణా తరగతులు పూర్తయిన అనంతరం 3:30 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. బ్యాలెట్ ఓటింగ్‌లో ఏపీవోలు, పీవోలు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

8వ తేదీ వరకు ఏసీ కాలేజీ ఫెసిలిటేషన్ సెంటర్

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏసీ కాలేజిలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. ఆదివారం స్థానిక ఏసీ కాలేజీలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ని కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్ ఎస్‌పీ కార్తీక తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరితో కలసి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ముందుగా హెల్ప్ డెస్క్‌లో తమ ఓటు వివరాలు తెలుసుకొని, ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటర్లకు వీలుగా 6 కౌంటర్లు ఏర్పాటు చేశామని, వాటిలో గుంటూరు తూర్పు నియోజకవర్గానికి 4, ఇతర జిల్లాల ఓటర్లకు 2 కౌంటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. 5,6 తేదీల్లో పీఓ, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ జరుగుతుందని, శిక్షణ అనంతరం పోస్టల్ బ్యాలెట్ చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 7వ ఓపీఓలు, 8న పోలీసులు, ఎన్నికల విధులు కేటాయించబడిన ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అదే విధంగా ఎన్నికల విధుల్లో ఉండి ఫారం–12 దరఖాస్తు చేసుకొని ఉద్యోగులు ఈ నెల 7,8 తేదీల్లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

శ్రీనివాసశర్మ, నటుడు కావూరికి సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: ఖగోళ వాస్తు శాస్త్రాలు సశాస్త్రీయమైనవని, సూర్యచంద్రులు, నక్షత్రాల గమనాల ఆధారంగా మానవ హితం కోరి శాస్త్రాలు ఏర్పడ్డాయని ప్రముఖ వాస్తు జ్యోతిష సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని రీడింగ్ రూమ్స్ భవన సమావేశ మందిరంలో శాస్త్రాలపై, బ్రాహ్మణత్వంపై జరుగుతున్న అశాస్త్రీయ దాడులకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సిద్ధాంతి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ మన విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న పాశ్చాత్య దేశాలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దేవాలయాలను ఆదాయ వనరులుగా చూడటం, ధర్మాన్ని కాపాడే బ్రాహ్మణులపై కొంత మంది అధికారుల పెత్తనం బాధాకరమన్నారు. ఈ ధోరణి మారగలిగితేనే హిందూ సమాజం మనుగడ సాగించగలదన్నారు. సిద్ధాంతి శ్రీనివాస శర్మ, రంగస్థల నటులు కావూరి సత్యనారాయణను సత్కరించారు.

ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నీరజ్ కుమార్



శిక్షణా కార్యక్రమంలో సూచనలు చేస్తున్న నీరజ్ కుమార్

మంగళగిరి: అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నీరజ్ కుమార్ అన్నారు. ఆదివారం మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఎన్నికల విధులపై చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకులు తనిఖీ చేశారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా తొలిరోజు 392 మంది ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ కేంద్రాల వద్ద ఏ విధంగా పని చేయాలో మాస్టర్ ట్రినర్స్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఆరు బృందాలతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా బృందాలకు ఉద్యోగుల నుంచి పోస్టల్ బ్యాలెట్‌లను ఏ విధంగా తీసుకోవాలో దశలవారీ ప్రక్రియ గురించి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తగు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు అందించిన హ్యాండ్ బుక్‌ను చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణపై ఏమైనా అనుమానాలు ఉంటే మాస్టర్ ట్రినర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించాలి

ఎన్నికల పరిశీలకులు కార్తీక



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు కార్తీక, పక్కన తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పీఓలు, ఏపీఓలకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని సమర్థంగా పనిచేయాలని గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు ఎస్‌పీ కార్తీక తెలిపారు. ఆదివారం ఏసీ కాలేజీలో నిర్వహిస్తున్న తూర్పు నియోజకవర్గ పీఓలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణను రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరితో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వర్తించేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. ప్రధానంగా ఎన్నికల సరళిలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కారాల శిక్షణపై మాస్టర్ ట్రినర్లు దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న పీఓలు కూడా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌ఓ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ పీఓలకు జరుగుతున్న శిక్షణలో ప్రధానంగా పోలింగ్ రోజు పూర్తి చేయాల్సిన వివిధ ఫారాలు, పీఓ డైరీ, మాక్ పోల్, ఈవీఎంల కనెక్షన్, ఈవీఎం కవర్లు, స్క్రూటినీ కవర్లు తదితర అంశాలపై పీఓలు, ఏపీఓలు సమగ్రంగా తెలుసుకొని ఉండాలన్నారు.

గోమాంసం తరలింపుపై విచారణ చేపట్టాలి

నగరంపాలెం: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో గోమాంసం తరలిస్తున్నారని ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహించారని శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశివస్వామి ఆరోపించారు. బ్రాడీపేట 1/1లోని బజరంగ్‌దళ్ గుంటూరు జిల్లా (విశ్వ హిందూ పరిషత్ యువజన విభాగం) కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. శివస్వామి మాట్లాడుతూ విశాఖపట్నం – సికింద్రాబాద్‌కు గోమాంసం తరలిస్తున్నారనే సమాచారంపై హిందూ సంఘాల నాయకులు, పలువురు స్వామీజీలు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు గోపీకృష్ణ, శివశక్తి అధ్యక్షుడు హర్షవర్ధన్‌శాస్త్రి, లక్ష్మీరామాంజిదాసి, ఏపీహెచ్‌డీఎస్ అధ్యక్షుడు అనిల్ బెహరా, యుగతులసీ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సత్యప్రమోద, భజరంగ్‌దళ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిశరత్, నవోదయం పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎస్.విజయరాజు, గోరక్ష నాయకులు హరిహరరాయలు, ప్రదీప్‌జైన్ పాల్గొన్నారు.

పాడైన ముక్కుకు పూర్వపు స్థితి

గుంటూరు ఒమేగా ఆస్పత్రిలో ముక్కు శస్త్రచికిత్స సక్సెస్



డాక్టర్ సుమితా శంకర్

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌తో ముక్కు ఆకారం పూర్తిగా కోల్పోయిన ఓ వృద్ధురాలికి గుంటూరు ఒమెగా హాస్పిటల్ వైద్యులు అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి ముక్కును పునర్నిర్మాణం చేశారు. గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలికి ఒమేగా ఆసుపత్రిలో ముక్కు పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ సుమితా శంకర్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.నాగకిషోర్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వృద్ధురాలు క్యాన్సర్ (కార్సినోమా నోస్)తో బాధ పడుతూ తమ వద్దకు చికిత్సకు వచ్చినట్లు చెప్పారు. ముక్కుపై మొదట్లో చిన్న పెరుగుదలగా కనిపించి, రెండేళ్ల పాటు నిర్లక్ష్యం చే యడంతో క్రమంగా వ్యా పించి, ముక్కులో దాదాపు మూడు వంతుల భాగంలో కణితి పెరిగిపోయినట్లు తెలిపారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు అత్యవసర చికిత్స కోసం ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చారన్నారు. మూడు నెలలపాటు రోగికి మూడు సార్లు ఆపరేషన్లు చేసి ముక్కుకు పూర్వపు ఆకారం తీసుకొచ్చామని వెల్లడించారు. పోలీసు శాఖ సిబ్బంది, వారి కుటుంబాల లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యభద్రతా పథకాన్ని ఉపయోగించి ఉచితంగా ఆపరేషన్ చేశామని వెల్లడించారు.

వైఎస్సార్ సీపీలో మైనార్టీలకు ప్రాధాన్యం



టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్ : ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ద్వారానే ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించ బడిందని, ఈనాడు ఆయన తనయుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మైనార్టీలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య అన్నారు. ఆదివారం నులకపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మురుగుడు లావణ్య సమక్షంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన 30 కుటుంబాల మైనార్టీ మహిళలు, సోదరులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నుంచి వచ్చిన వారికి కండువాలు కప్పి మురుగుడు లావణ్య వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది వైఎస్ కుటుంబమేనని అన్నారు. ముస్లిం సోదరులు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఫ్యాను గుర్తుపై పోటీ చేస్తున్నామని, ఈ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో షేక్ సుభాని, షేక్ బాజీ, షేక్ జిలాని, పి.బాజీఖాన్, పి. పర్వీన్ ఖానమ్, షేక్ చాందిని, రహీమా, వహిదా, సుఫియా, మొహసీ, రోషిణి, నయిమ్, ఎండి జరీనా, ఎండీ లూబానా, ఎండి సలోన, పి. రూఫీ ఖానమ్, యస్‌కె సిలార్, పి.రబ్బాని ఖాన్, యస్‌కె అన్సరీ, యస్‌కె సుభాన, నజ్మ, యస్‌కె నజీర్, అంతుమిమిన్, యస్‌కె నౌషాద్, మున్న, సలామ్, మున్ని, నజీర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరె, ఇర్ఫాన్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెబుతాం

భారత్ బచావ్ ప్రతినిధులు పిలుపు

లక్ష్మీపురం: మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెప్పాలని భారత్ బచావో ప్రతినిధులు డాక్టర్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం భారత్ బచావో ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ, అంబానీల లాంటి కార్పొరేట్ కంపెనీలకు సంపాదను దోచిపెట్టిన మోదీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. బీజేపీతో పాటు మిత్రులైన టీడీపీ, జనసేన పార్టీలను ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ వైస్‌చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మి, భారత్ బచావో ఆంధ్రప్రదేశ్ చైర్మన్ సి.భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా నవజ్యోతి మాట్లాడారు. మే 13వ తేదీ ఎన్నికలలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ, సిపిఐ(యం–యల్), వీసీకే పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో భారత్ బచావో జిల్లా అధ్యక్షుబు బత్తుల కోటేశ్వరరావు, కార్యదర్శి సమతావేము, న్యాయవాది శిఖా సురేష్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ పరిశోధకుడు ఎస్.నాగేశ్వరరావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. సోషియాలజీ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఆల్కాహాలిజం ఆన్ షెడ్యూల్డ్‌కాస్ట్ పాపులేషన్ ఇన్ గుంటూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథంసమర్పించినందుకుగాను నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని తెలిపారు.

అలరించిన మధువని సుస్వరాల పల్లకి

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో సినీ సంగీత విభావరి ఆధ్వర్యం లో ఆదివారం సాయంత్రం 'మధువని' సుస్వరాల పల్లకి నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త గాదె రత్నారెడ్డి, విద్యాశాఖ ఏడీ రాజంశెట్టి నరసింహారావు, భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయనీ, గాయకులు మధు బాబు, కృష్ణారావు, శివప్రసాదరావు, శ్రీనివాసరావు, నారాయణరావు, రామకృష్ణ, గాయత్రీదేవి, సౌజన్య, అన్నపూర్ణలు పాత, కొత్త చిత్రాల గీతాలను ఆలపించారు. సినీ ప్రేక్షకులను అలరించాయి. వ్యాఖ్యాతగా కృష్ణారావు వ్యవహరించగా, సినీ సంగీత విభావరి వ్యవస్థాపకులు వెలిశెల మధుబాబు, ప్రసాదరావు, పాలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు తెలంగాణ మద్యా న్ని సాయిప్రసాద్ కారులో తరలిస్తున్నాడు. కంకరగుంట ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న స్క్వాడ్ టీమ్ ఏడు లీటర్ల మద్యాన్ని, తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.